

భక్త జనసంద్రం నడుమ కదులుతున్న బ్రహ్మరథం

రథోత్సవానికి ముందు పూజలు చేస్తున్న వేదపండితులు

స్వామి, అమ్మవార్లు

నమో నారసింహా..!

- అట్టహాసంగా ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన తిరువీధులు
- ఉదయం 8.16 గంటలకు కదిలిన బ్రహ్మరథం
- మధ్యాహ్నం 3.56 గంటలకు యథాస్థానానికి..
- వేలాది మంది భక్తులతో కిటకిటలాడిన కదిరి



రథోత్సవంలో సందడి

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం కన్నులపండువగా సాగింది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. తిరువీధులు కిక్కిరిసిపోయాయి. రథంపై దేవదేవుడిని వీక్షించిన భక్తులు.. తన్మయత్వంతో నమో నారసింహ అని నినాదాలు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైనది బ్రహ్మరథోత్సవం. ఈ వేడుకకు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి బ్రహ్మరథోత్సవం గురువారం ఉదయం 8.16 గంటలకు ప్రారంభమైంది. అంతకు ముందు వేద పండితులు రథారోహణం గావించారు. రథం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు, ఏవీ పార్థసారథి అచార్యులు పుణ్యాహవచనం, బలిహారణ, కుంభహారతి నిర్వహించారు. అనంతరం రథంలో స్వామివారి ఆరాధన, అక్షతారోహణం చేశారు. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవారిని **(తరువాయి 7లో)**





ద్రోన్లు విస్తృతంగా వినియోగించండి

పోలీసులకు ఎస్పీ ఆదేశాలు

అనంతపురం క్రైం, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పోలీసు అధికారులకు ఎస్పీ పలు ఆదేశాలిచ్చారు. డ్రోన్లతో అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, బందోబస్తు, సమస్యాత్మక గ్రామాల్లో నిఘా కొనసాగించాలన్నారు. వాహన తనిఖీల సమయంలోనూ డ్రోన్లను వినియోగించాలన్నారు. లారీలు, లగేజీ, భారీ వాహనాల్లో ఏమి తరలిస్తున్నారో పసిగట్టాలన్నారు. పేకాట, మట్కా, క్రికెట్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్లను వాడాలన్నారు. భారీ సభలు, ఆందోళనలు, రథోత్సవాలు, జాతరల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లో రోజూ డ్రోన్లు ఎగుర వేయాలన్నారు. తద్వారా ఆయా గ్రామాల్లో మిద్దెలపై చట్టవ్యతిరేకంగా ఏదైనా నిల్వ చేసుకున్నా తెలిసిపోతుందనీ, ముందస్తు చర్యలు చేపట్టడానికి వీలుంటుందన్నారు.

మూటను మింగేయాలని..!

- పెన్నహోబిలం ఆలయంలో సిబ్బంది కుట్ర
- హుండీలో కానుకల మూటను దాచేసిన వైనం
- పంపకాల్లో తేడాతో వ్యవహారం వెలుగులోకి..!
- విచారణ చేపట్టిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్



అర్చకుడితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీ

ఉరవకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి భక్తుడు సమర్పించిన కానుకల మూటను కాజేయాలని చూశారు. హుండీ లెక్కింపులో ఈ మూట కనిపించని విషయం బయటకు పొక్కడంతో బుధవారం రాత్రికి రాత్రే హుండీలోకి ఆ మూటను వేసి.. తమకేమీ తెలియనట్లుగా అధికారులు మౌనంగా ఉండిపోయారు. గత ఏడాది డిసెంబరు 7న అమిద్యాలకు చెందిన రంగయ్య, వనజాక్షి దంపతులు మొక్కును తీర్చుకునేందుకు ఆలయానికి వెళ్లారు. అమ్మవారికి బంగారు తాళిబొట్టు గొలుసు, ముక్కుపుడక, కమ్మలు, వెండి పట్టీలు మూటకట్టి హుండీలో వేశారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని భక్తుడు తెలిపాడు. దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం హుండీ సొమ్మును లెక్కించారు. ఆ సమయంలో కొందరు నగల మూటను దాచినట్లు తెలిసింది. అందులో ఉన్న కానుకల పంపకాలలో తేడా రావడంతోనే వ్యవహారం బయటకు పొక్కింది. విషయం తెలుసుకున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు గురువారం సాయంత్రం పెన్నహోబిలం చేరుకుని విచారణ చేపట్టారు. బంగారు ఆభరణాలను ఎందుకు లెక్కించలేదని ఈవో రమేష్‌ను భక్తుడు ప్రశ్నించగా, అతని పట్ల ఈవో దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనపైన సమగ్ర విచారణ జరిపించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

హుండీ లెక్కింపు సమయంలో బంగారు ఆభరణాల మూటను లెక్కించలేదని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు తెలిపారు. హుండీ లెక్కింపు పూర్తి అయిన తర్వాత శుభ్రం చేసే సమయంలో నగల మూట దొరికిందని, వాటిని తిరిగి హుండీ వేశారని తెలిపారు. నగల మూటను తెరిచి చూశామని, అందులో ముక్కుపుడక కన్పించలేదని అన్నారు. బంగారు ఆభరణాల మూట గురించి ఈవో తనకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఈ ఘటనపై 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే..

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఈవో రమేష్ తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. 2021లో ఆలయానికి సంబంధించిన నగదును నేరుగా డ్రా చేయడం, రికార్డుల నిర్వహణ లేకపోవడం వంటి 32 అభియోగాలను పరిగణనలోకి తీసుకుని అప్పట్లో సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన చోటే అతనికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిచ్చింది. రథం నిర్మాణానికి టెండర్లు పూర్తి అయిన తరువాత విరాళాలు సేకరించడంపైనా చర్చ నడుస్తోంది. అన్నదానం విరాళాలు, అద్దెల వసూళ్లు.. రశీదులలో పేర్కొన్న మొత్తానికి పొంతన లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆలయ అభివృద్ధి పేరు చెప్పి భక్తుల నుంచి విరాళాలు సేకరించారని, వాటికి రశీదులు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2022లో గవిమఠంలో పనిచేసే సమయంలో ఓ వైసీపీ నాయకుడి ఆదేశాలతో అతని అనుచరులకు వేలం పాట లేకుండానే భూములు కట్టబెట్టడం వివాదాస్పదమైంది.

ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేయండి

- రైతులకు రూ.14.50 కోట్ల నష్టపరిహారం అందించండి
- అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ఆగిపోయిన జీడిపల్లి-అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు కాలువ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో గురువారం ఆమె మాట్లాడుతూ, టీడీపీ హయాంలో రూ.804 కోట్లతో సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ రిజర్వాయర్ల నిర్మాణం, జీడిపల్లి-పేరూరు మధ్య 53 కి.మీ. కాలువ నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. పనులు 28 శాతం జరిగాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పక్కనపెట్టి, కొత్తగా మూడు ప్రాజెక్టులను నిర్మిస్తామని గొప్పలు చెప్పిందని, భూసేకరణ చేయకుండా రైతులకు అన్యాయం చేసిందని అన్నారు. వెయ్యి ఎకరాలకుపైగా భూమి అవసరమైతే.. కేవలం 95 ఎకరాలకు రూ.5కోట్లు చెల్లించారని అన్నారు. ప్రస్తుతం 67 ఎకరాలకు రూ.14.50 కోట్లు సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేశారని, ఈ నిధులు ఇవ్వడంతో పాటు ప్రస్తుత ధరలతో మరింత భూసేకరణ చేయాల్సి ఉందని అన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ.. గతంలో ఎప్పుడూ లేని విధంగా హంద్రీనీవాకు నిధులు కేటాయించామని అన్నారు. ప్రస్తుతం మాల్యాల నుంచి 2,200 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ ఉందని, 3,850 క్యూసెక్కులకు పెంచుతున్నామని అన్నారు. తద్వారా జీడిపల్లి జలాశయానికి ఎక్కువగా నీరు వస్తుందని, ఆ నీటిని పేరూరు జలాశయం వరకూ తరలిస్తామని అన్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులకు ఇవ్వాల్సిన రూ.14.50 కోట్ల పరిహారం త్వరలోనే అందుతుందని మంత్రి హామీ ఇచ్చారని పరిటాల సునీత తెలిపారు.

వాల్మీకులకు న్యాయం చేయండి..

ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆరు దశాబ్దాలుగా పోరాడుతున్న వాల్మీకులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాల్మీకులకు టీడీపీ మొదటి నుంచి ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. గతంలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉండేవారని, కొన్ని పరిస్థితుల కారణంగా బీసీలుగా మార్చారని అన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని టీడీపీ హయాంలో అసెంబ్లీలో తీర్మానం చేసి, సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వాల్మీకులకు ద్రోహం చేసిందని విమర్శించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (శుక్రవారం సాయంత్రం)

సెహరీ : 5.06 (శనివారం ఉదయం)

ఎస్సీ వర్గీకరణతోనే
సామాజిక న్యాయం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు సముచిత న్యాయం సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అసెంబ్లీలో గురువారం అన్నారు. ఉపకులాల మధ్య ఆర్థిక అసమానతలు తొలగి విద్య, ఉద్యోగాలలో సమన్యాయం జరగడానికి వర్గీకరణ దోహదపడుతుందని అన్నారు. అణగారిన వర్గాలకు సముచితస్థానం కల్పించడంలో సీఎం చంద్రబాబు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వంలోనే చంద్రబాబు వర్గీకరణను అమలు చేశారని, న్యాయపరమైన అడ్డంకులతో ఆ ప్రక్రియ ఆగిపోయిందని అన్నారు. ప్రధాని మోదీ వర్గీకరణ ప్రాధాన్యాన్ని గుర్తించి, ప్రకటన చేశారని అన్నారు. సామాజిక న్యాయం అనే అంశాన్ని ఎన్టీఆర్ తొలినాళ్లలోనే ఆచరణలో పెట్టారని అన్నారు. ఆయన బాటలోనే చంద్రబాబు నడుస్తున్నారని అన్నారు. వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రయత్నం 60 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారి కలను నిజం చేయడానికి చంద్రబాబు కృషి చేశారని, అయినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంక దొంగతనాలు జరగనివ్వం: ఎస్ఐ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నార్పల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న వరుస దొంగతనాలపై ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన 'దొంగల్లారా దొరికిపోండి' కథనానికి జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. కేసులను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నార్పల ఎస్ఐ సాగర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో కొందరు బాధితులను గురువారం స్టేషన్‌కు పిలిపించి, విచారించారు. అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారించాలని, పాత నేరస్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. ఇకపై దొంగతనాలు జరగకుండా చూస్తామని ఎస్ఐ సాగర్ తెలిపారు. చోరీ కేసులను ఛేదిస్తామని అన్నారు.

పారదర్శకతకు సలహాలు ఇవ్వండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శక ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నుంచి సలహాలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ఢిల్లీలో రాజకీయ పార్టీలు, కలెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిందని తెలిపారు. ఎన్నికలను మరింత పారదర్శకంగా ఎలా నిర్వహించాలో లోతుగా చర్చించిందని అన్నారు. అందులో భాగంగానే ఓటరు జాబితా సవరణ, ఎన్నికల నిర్వహణ గురించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతినెలా మొదటి వారంలో సమావేశాలు ఉంటాయని, పార్టీల ప్రతినిధులు చెప్పిన అభిప్రాయాలను ఎన్నికల కమిషన్‌కు అదే నెల 20వ తేదీలోగా తెలియజేస్తామని వివరించారు. సమావేశంలో ఎన్నికల విభాగం తహసీల్దారు యుగేశ్వరి, డీటీ కనకరాజు పాల్గొన్నారు.

వందే భారత్!


బెంగళూరు-కలబురగి వందే భారతి రైలు

- రైలుకు జై కొడుతున్న ప్రయాణికులు
- సేవలపై సంతృప్తి
- టిక్కెట్టు ధరలు కాస్త ఎక్కువ అంటున్న పలువురు



గుంతకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలుకు జనం జై కొడుతున్నారు. రైలులో ప్రయాణం, సేవలు అద్భుతమని పేర్కొంటున్నారు. టిక్కెట్టు ధరలే కాస్త ఎక్కువ అంటూ పలువురు పేర్కొంటున్నారు. అయినా, సేవలు ఆ స్థాయిలోనే అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలబురగి-బెంగళూరు-కలబురగి వందేభారత్ రైలు (నం.22231/32) ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ప్రయాణికులను 'ఆంధ్రజ్యోతి' స్థానిక రైల్వే స్టేషన్‌లో పలకరించింది. వారి అనుభవాలను అడిగి తెలుసుకుంది. టిక్కెట్టు ధరతో ముడిపెట్టకుండా చూస్తే వందేభారత్ రైలు సేవలు అత్యుత్తమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. పగటివేళ తిరిగే ఈ రైలు వల్ల ప్రయాణ బడలిక లేకుండా గమ్యస్థానాలకు చేరుకుంటున్నామని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. రిజర్వేషన్ విధానం వల్ల వందలాది సీట్లు ఖాళీగా ఉన్నా, చివరి నిమిషంలో ఈ రైల్లో ప్రయాణించడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే శాఖ చొరవ చూపాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

రెండో తరం రైలు

వందేభారత్ రైళ్లలో రెండో తరం రైలును బెంగళూరు-కలబురగి (గుల్బర్గా) మధ్య గత సంవత్సరం మార్చి 12వ తేదీన ప్రారంభ రన్ నిర్వహించారు. ఇది వందేభారత్ రైళ్లలో 26వది. కలబురగి-బెంగళూరు మధ్య 548 కి.మీ.ల దూరాన్ని 8 గంటలా 45 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా సమయాలను నిర్ణయించారు. ఈ రైలు కలబురగిలో ఉదయం 5.15కి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. గంటకు 63 కి.మీ.ల సగటు, 130 కి.మీ.ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తోంది. కేవలం ఆరు స్టాపింగ్‌లు ఉంటాయి. కలబురగిలో బయలుదేరే ఈ రైలును యాద్గిర్, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, అనంతపురం, యల్హంక స్టేషన్లలో మాత్రమే నిలుపుతున్నారు. శుక్రవారం మినహా వారంలో ఆరు రోజులు ఈ రైలును నడుపుతున్నారు.

పగటిపూట అనుకూలం

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పగటి వేళల్లో ప్రణించడానికి కూడా బెర్త్‌ను రిజర్వు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ చేసినా పగటి వేళ కింద, మధ్య బెర్తుల ప్రయాణికులు పడుకోవడానికి వీలుండదు. కనుక సాధారణంగా పగటి వేళల్లో ప్రయాణికులు కూర్చునే ప్రయాణిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పగటి వేళలో బయలుదేరి, సాయంత్రంలోపు గమ్యస్థానానికి చేరుకునేలా వందేభారత్ రైళ్లను రూపొందించారు. ఈ రైళ్లల్లో బెర్తులు ఉండవు. (త్వరలో బెర్తులు కలిగిన వందేభారత్ రైళ్లను ప్రవేశ పెట్టనున్నారు). బస్సుల్లో మాదిరి కూర్చుని ప్రయాణించడానికి వీలుగా రెండు రకాల టిక్కెట్లను జారీ చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్, ఎకానమీ చైర్ అనే రెండు స్థాయిల కార్ సిస్టం ఈ వందే భారత్ రైలులో ఉంది. ఎగ్జిక్యూటివ్ చైర్ ధర ఎకానమీ కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. విమానాల మాదిరిగా టిక్కెట్ బుకింగ్ సమయంలోనే ఆహారాన్ని ఆర్డర్ ఇచ్చేలా ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించారు. రేటు ఎక్కువగా ఉన్నా దానికి తగినంత సేవలు అందిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మరి కొందరు ధర ఎక్కువని ఆర్థిక ఇబ్బందిని వ్యక్తం చేస్తున్నారు. బస్సు కంటే ఎంతో మెరుగ్గా ప్రయాణం సాగుతోందని ప్రయాణికులందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు.

సేవలు అద్భుతం



వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వందే భారత్ రైలులో వెళ్తుంటా. టిక్కెట్టు రేటు ఎక్కువైనా అందులో సేవలు అద్భుతంగా ఉన్నాయి. విమానాల్లో మాదిరిగానే వేళకు టీ, టిఫిన్, భోజనం అందిస్తున్నారు. ఆహారం బాగా ఉంటోంది. పరిశుభ్రత పాటిస్తున్నారు. కుదుపుల్లేని ప్రయాణం, సకాలంలో గమ్యస్థానానికి చేర్చడం నచ్చింది. టిక్కెట్టు రేట్లు ఎక్కువగా ఉన్నాయని చింతించాల్సిన అవసరం లేదు. డబ్బుకు తగిన సేవలు అందిస్తున్నారు.

-సంజయ్ జీరావాలా, వ్యాపారి, గుంతకల్లు

టిక్కెట్టు సమస్య

సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉన్నపుడు బెర్తులు ఖాళీగా ఉండవు. ఒకవేళ చివరి నిమిషంలో ప్రయాణికులు టిక్కెట్టు రద్దు చేసుకున్నా ఖాళీగా ఉండే ఆ బెర్తును టీటీఈ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు కేటాయించే అవకాశం ఉంది. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో వెయిటింగ్ లిస్టు టిక్కెట్లను జారీ చేయడం ఉండదు. రైల్వే స్టేషన్‌కు 40 కి.మీ.ల దూరంలో వందే భారత్ రైలు వచ్చేసిందంటే కరంట్ చార్ట్ ప్రిపరేషన్ జరుగుతుంది. చార్ట్ సిద్ధమైన తర్వాత టిక్కెట్టును పొందలేరు. రైల్వే స్టేషన్‌కు వచ్చి, వందే భారత్ రైలులో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిసినా అప్పటికప్పుడు టిక్కెట్టు కొనలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారం చూపుతూ.. సీట్లు ఖాళీగా ఉంటే రైలు వచ్చే ఐదు నిముషాల ముందు కూడా టిక్కెట్లను జారీచేసేలా రైల్వే శాఖ కృషిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిక్కెట్ల ధరలు తడిసి మోపెడు..



వందే భారత్ రైళ్లలో ఎకానమీ టిక్కెట్ల ధరలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ-2 టైర్ రేంజ్‌లో ఉంటాయి. ఇక ఎగ్జిక్యూటివ్ చైర్ టిక్కెట్టు రేట్లు ఏకంగా విమానపు చార్జీని తలపిస్తాయి. కలబురగి నుంచి బెంగళూరుకు వెళ్లాలంటే వందే భారత్ రైల్లో ఎకానమీ టిక్కెట్టు ధర రూ.1,700, ఎగ్జిక్యూటివ్ అయితే రూ.2,700. ఈ రేట్ల కారణంగా 25 శాతం సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.

- ప్రశాంత్, చార్టెడ్ అకౌంటెంట్, కలబురగి

రైలు వచ్చే ముందు టిక్కెట్లివ్వాలి



వందే భారత్ రైలుకు సాధారణంగా ఆన్‌లైన్‌లోనే టిక్కెట్టు బుక్ చేసుకుంటుంటారు. అధిక టిక్కెట్టు ధరల కారణంగా చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. రైలు వచ్చే ముందు టిక్కెట్టు కొందామనుకున్నా సాధ్యపడదు. ఈ రైలులో వెయిటింగ్ లిస్టు ప్రయాణికులకు ప్రవేశం లేనందున సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. రైల్వేకి కూడా ఇది నష్టం. చివరి నిమిషంలో టిక్కెట్టు కొని ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పించాలి.

- రవితేజ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, బెళుగుప్ప

తూతూమంత్రంగా బదిలీలు

సిఫారసు లేఖలు తూచ్..

హెల్త్ గ్రౌండ్, దివ్యాంగ, స్పౌజ్ రిక్వెస్ట్‌లకు నో చాన్స్

వివాదాస్పదంగా పామిడి, గుత్తి ఏపీఓల నియామకం


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో, డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్వామాలో బదిలీలు తూతూమంత్రంగా సాగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి సొంత ప్రణాళికలను డ్వామా అధికారులు అమలు చేశారు. డ్వామాలో కీలకంగా ఉండే హెచ్ఆర్, మరో ద్వితీయ ఉన్నతాధికారి ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా వ్యవహరించారు. గురువారం స్థానిక డ్వామా హాల్‌లో డీఆర్వో మలోల, పీడీ సలీంబాషా ఆధ్వర్యంలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. సీనియార్టీ ప్రకారం బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, హెల్త్ గ్రౌండ్, దివ్యాంగులు, స్పౌజ్ రిక్వెస్ట్‌లు పరిగణనలోకి తీసుకోలేదనే వాదన వినిపిస్తోంది. పామిడి, గుత్తి ఏపీఓల బదిలీ వివాదాస్పదంగా మారింది.

వినతులు తూచ్..

డ్వామా బదిలీల్లో అనేక వింతలు కనిపిస్తున్నాయి. రిక్వెస్ట్, హెల్త్‌గ్రౌండ్, స్పౌజ్, దివ్యాంగుల వినతులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుత్తి, పామిడి ఏపీఓల బదిలీలు వివాదాస్పదంగా మారాయి. యాడికిలో ఉన్న ఏపీఓ రమేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. గుత్తిలో ఉన్న మద్దిలేటిని యాడికికి బదిలీ చేశారు. కూడేరు ఏపీఓ తులసిప్రసాద్‌ను పామిడికి పంపారు. పీడీ కార్యాలయంలో ఉన్న ఆదినారాయణమ్మ తాడిపత్రిలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆదినారాయణమ్మను పామిడికి బదిలీ చేస్తున్నామనీ, ఇదివరకు పామిడికి బదిలీ చేసిన తులసిప్రసాద్‌ను గుత్తికి మార్చామని డ్వామా అధికారులు చెప్పడంతో పలువురు ఏపీఓలు వాగ్వాదానికి దిగారు. పామిడి ఎంపీడీఓ... ఏపీఓగా ఆదినారాయణమ్మ వస్తేనే విధుల్లో చేర్చుకుంటాననీ, వేరే వాళ్లు వస్తే వెనక్కు వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. గుమ్మఘట్ట ఏపీఓగా పనిచేస్తున్న సురేష్‌కుమార్ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. తిరిగి అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. అదే క్లస్టర్‌లో పనిచేస్తున్న నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు ఐదేళ్లు పూర్తయినా తిరిగి అదే క్లస్టర్‌లో నియమించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఐదేళ్లు పూర్తయినా వారిని కదిలించకపోవడం గమనార్హం. హెచ్ఆర్ మేనేజర్ సర్వీస్ ఆరేళ్లు కావస్తున్నా అక్కడే ఉంచడం పట్ల ఉద్యోగుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. బుక్కరాయసముద్రంలో ఉన్న ఏపీఓ పోలేరయ్యను కూడేరుకు, ఉరవకొండ ఏపీఓ విమలను గుంతకల్లుకు, పుట్లూరు ఏపీఓ చెన్నకేశవయ్యను ఆత్మకూరుకు, పెద్దవడుగూరులో ఉన్న ఏపీఓ పుల్లారెడ్డికి తిరిగి అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఏడాదిగా వివిధ ఆరోపణలు ఎదుర్కొంటూ పీడీ కార్యాలయంలో కూర్చుని జీతం తీసుకుంటున్న ఏపీఓలు ఓబిరెడ్డి, విజయభారతిని ఎక్కడా బదిలీ చేయలేదు. అనంతపురం రూరల్ ఏపీఓగా ఉన్న చంద్రకళను తాడిపత్రికి బదిలీ చేశారు.

175 మందికి కౌన్సెలింగ్

డ్వామాలో 175 మంది ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో 11 మంది ఏపీఓలు, 98మంది టీఏలు, 51మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలు ఆన్‌లైన్‌లో బదిలీ కోసం ఆప్షన్ ఇచ్చారు. ఏడుగురు ఏపీఓలు, 98 మంది టీఏలు, 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలను బదిలీ చేశారు. వీటిలో తిరిగి మార్పులు చేర్పులు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

చెరువుకు నీరు.. చేనుకు నారు..

నిండిన బండమీదపల్లి చెరువు

- వ్యవసాయ బోర్లలో పెరిగిన నీరు
- విస్తారంగా పంటల సాగు అన్నదాతల ఆనందం
- వైసీపీ పాలనలో ఐదేళ్లూ అరకొరగా నీరు


నీటితో కళకళలాడుతున్న బండమీదపల్లి చెరువు

రాప్తాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి చెరువుకు ఐదేళ్ల తరువాత జలకళ వచ్చింది. ఊరికి పండగొచ్చింది. హంద్రీనీవా నీటితో చెరువును పూర్తిగా నింపడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. వ్యవసాయ బోర్లలో నీరు వస్తోంది. దీంతో రైతులు పంటల సాగుకు ఉపక్రమించారు. విస్తారంగా వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. చెరువు కింద వందల ఎకరాల్లో పచ్చదనం పరచుకుంది. టీడీపీ హయాంలో కాలువ తవ్వి, చెరువుకు నీరు వదిలారు. అప్పట్లో చెరువును పూర్తిగా నింపారు. వైసీపీ అధికారం చేపట్టాక పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును పూర్తిస్థాయిలో నింపలేదు. అరకొరగా నీరు వదిలి, మమ అనిపించేవారు. ఆ నీరు చెరువు గుంతల్లోకి కూడా చాలేది కాదు. దీంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోయి, చాలా బోర్లలో నీరు రాకుండా పోయింది. రైతులు చేసేదిలేక పంటల సాగు ఆపేశారు. గతేడాది కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ చెరువుకు జలకళ వచ్చింది. ఈ ఏడాది చెరువును పూర్తిస్థాయిలో నింపడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయి.


గతేడాది చెరువులో నీరు లేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం


సాగు చేసిన వరి

రూ.కోట్లు ఖర్చు పెట్టి.. కాలువ తవ్వి..

టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. తద్వారా ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక చెరువుకు నీటి విడుదలపై నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును నింపలేదు. దీంతో వ్యవసాయ బోరుబావులు వట్టిపోయి, పొలాలను రైతులు బీడుగా వదిలేయాల్సి వచ్చింది. తాగునీటికీ ఇబ్బందులు తలెత్తాయి. పాడి పెంపకానికి సైతం అన్నదాతలు అవస్థలు పడ్డారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు. దీంతో చెరువు నిండి, కళకళలాడుతోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటంతో దూరప్రాంతాల్లోని రైతుల పొలాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగి విరివిగా పంటలు సాగు చేశారు.

ఎమ్మెల్యే చొరవతోనే చెరువుకు నీరు



టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువుకు నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో గ్రామంలో రైతులు, ప్రజలు.. సాగు, తాగు నీటికి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు.

-శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి

పుష్కలంగా నీరు



గతేడాది చెరువులో నీరు అరకొరగా ఉండడంతో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గి, రైతులు పంటల సాగుకు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం చెరువు నిండా నీరు ఉండటంతో వ్యవసాయ బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. రైతులు విరివిగా పంటలు సాగు చేసుకుంటున్నారు.

- ప్రసాద్, రైతు, బండమీదపల్లి

మగాడ్రా బుజ్జీ..!

సస్పెన్షన్ అయిన చోటికే పోస్టింగ్.. కణేకల్లు మోడల్ స్కూల్‌లో విడ్డూరం


మోడల్ స్కూల్

రాయదుర్గం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పైరవీలు శృతిమించాయి. పై అధికారుల చేతులు తడిపితే చాలు.. అనుకున్నది సాధించుకోవచ్చని ప్రచారం జరుగుతోంది. నిబంధనలను ఖాతరు చేయకుండా పోస్టింగ్‌లు ఇవ్వడం ఆరోపణలుకు బలం చేకూరుస్తోంది. సస్పెండ్ అయిన వారికి తిరిగి అదే స్థానాన్ని కేటాయించకూడదు. కానీ అక్కడే రీ పోస్టింగ్ ఇచ్చారు. విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో ఇలా చేస్తే.. రికార్డులను తారుమారు చేసే ప్రమాదం ఉంది. తమకు అనుకూలంగా వ్యవహారాన్ని చక్కదిద్దుకునే వీలుంది. కణేకల్లు మోడల్ స్కూల్‌లో సివిక్స్ అధ్యాపకుడు ఆదినారాయణప్పను జూలై 2024లో సస్పెండ్ చేశారు. ఎనిమిది నెలల అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేసి, అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఆదినారాయణప్ప అప్పట్లో విధులకు సక్రమంగా హాజరు కాలేదనే ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు దొంగ సంతకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి పరిస్థితిపై గత ఏడాది జూలై 11న ఆంధ్రజ్యోతిలో 'పెద్ద సారూ యాడున్నాడో..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు, తనిఖీలు నిర్వహించారు. ఆయన వ్యవహారాలపై సమగ్ర నివేదికను పై అధికారులకు సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా ఆదినారాయణపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. రెండురోజుల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సాధారణంగా సస్పెన్షన్ ఎత్తివేసిన సమయంలో వేరే ప్రాంతానికి పోస్టింగ్ ఇవ్వాలనే నిబంధన ఉంది. దీన్ని ఏమాత్రం పాటించలేదు. మోడల్ స్కూల్‌లో సస్పెన్షన్‌కు ముందు ఉన్న రికార్డులను తారుమారు చేస్తే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల్లో విచారణ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని పొందుపరిచారు. ఇలాంటి సమయంలో అక్కడే పోస్టింగ్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఉద్యోగాల కల్పన తరువు..!

- పాలిటెక్నిక్ కోర్సులతో మెండుగా అవకాశాలు
- పెరుగుతున్న డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 11 కళాశాలలు
- తొమ్మిది కోర్సులు.. 2,123 సీట్లు..
- ఏప్రిల్ 15వరకు దరఖాస్తులు


థర్మల్ ఇంజనీరింగ్ ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

అనంతపురం సెంట్రల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులు ఉద్యోగాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి సులువుగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. గత ఎనిమిది నెలల్లోనే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 803 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుతో కంపెనీల్లో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వాటిలో తొమ్మిది ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు 2,123 మంది విద్యార్థులకు కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇందుకు రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కామన్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తూనే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 30న పరీక్ష ఉంటుంది.

రాయలసీమకే తలమానికం

రాయలసీమలోనే ఎక్కడాలేని వర్క్‌షాప్, ల్యాబ్‌లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సొంతం. ఎలక్ట్రికల్ ల్యాబ్, మెకానిక్ షాప్, మెటీరియల్ టెస్టింగ్, స్మితి.. షీట్ మెటల్, ఆటోమొబైల్ ల్యాబ్, థర్మల్ ఇంజనీరింగ్ ఫ్యూయల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ వైరింగ్, సాయిల్ మెకానిక్, ఫిట్టింగ్ సెక్షన్, ఫోర్, టూవీలర్ మెకానిక్ తదితర ల్యాబ్‌లున్నాయి. సీమెన్స్ ట్రైనింగ్ సెంటర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్, ఆటోమొబైల్ ఇండస్ట్రీ బేసిక్ టెక్నికల్ కోర్సుల శిక్షణా కేంద్రాలున్నాయి. సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్, డిజిటల్ మైక్రో, కమ్యూనికేషన్ మైక్రోవేవ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సుల కాలంలో 70 శాతం సమయం ఈ వర్క్‌షాప్, ల్యాబుల్లోనే విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఫలితంగా చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.

9 కోర్సులు, 2123 సీట్లు...

ఉమ్మడి జిల్లాలోని 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తొమ్మిది రకాల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. ఏఐ, ఎంఎల్, ఆటోమొబైల్, సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఈవీ, ఈసీఈ, మెకానికల్, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మొత్తం 2,123 సీట్లు ఉన్నాయి. వాటిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు.


కళాశాలలోని వర్క్‌షాప్, ల్యాబ్స్

8 నెలల్లోనే 800 ఉద్యోగాలు..

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు ఊపందుకున్నాయి. అధికారుల సమాచారం మేరకు గత ఐదేళ్లలో పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు 2020-24 మార్చి వరకు 224 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2024 జూలై నుంచి 2025 ఫిబ్రవరి వరకు 803 మంది ఉద్యోగాలు సాధించారు. కంపెనీల్లో సానుకూల పరిస్థితులు నెలకొనడాయనడానికి ఇది నిదర్శనం. ప్రముఖ కంపెనీలు.. పాలిటెక్నిక్ విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి.


స్మితి ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల →



సులువుగా ఉద్యోగాలు



పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగాలు సులువుగా పొందవచ్చు. మూడేళ్ల కోర్సు వ్యవధిలోనే ఉద్యోగం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాం. ఆ దిశగా ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఫలితంగా గత ఎనిమిది నెలల్లోనే 800 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

- జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



రథోత్సవంలో ఎస్పీ రత్న, బ్రహ్మరథోత్సవాన్ని సెల్‌లో బంధిస్తున్న ముస్లిం మహిళ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కందికుంట దంపతులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రథంపై దవణం వేస్తున్న భక్తులు

నమో నారసింహా..!

అట్టహాసంగా ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం

(5వ పేజీ తరువాయి)

బ్రహ్మరథంపై అధిష్ఠింపజేశారు. తిరువీధుల్లో భక్తులు స్వామివారికి దవణం, మిరియాలు, కాయకర్పూరాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులను అలరిస్తూ..

కిక్కిరిసిన భక్తుల నడుమ రథం ఉదయం 9. గంటలకు చౌక్ వద్దకు చేరుకుంది. అక్కడ చిన్నమొద్దుల తాళ్లు తెగిపోవడంతో దాదాపు గంట పాటు ఆగిపోయింది. ఆ తర్వాత 10 గంటలకు భక్తుల గోవింద నామస్మరణ నడుమ మహా మంగళహారతి పట్టి.. తిరిగి రథాన్ని ముందుకు కదిలించారు. వెనుక వైపున కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాల భక్తులు తెడ్లు వేస్తూ.. మొద్దులు తొక్కడంతో రథం వేగంగా ముందుకు కదిలింది. శివాలయం వద్దకు ఉదయం 11.30 గంటలకు రథం చేరుకుంది. అక్కడ వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గండిబండ అంజనేయస్వామి వద్దకు రథం 12 గంటలకు చేరుకుంది. అక్కడ నుంచి పడమర రాజగోపురం వద్దకు 12.30కు చేరుకుంది. అక్కడ రథంపై శ్రీవారు మరొకసారి పూజలు అందుకున్నారు. స్వామివారి రథం పైకి భక్తాదులు దవణం, మిరియాలు చల్లుతూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. గొల్ల మంటపం వద్దకు సరిగ్గా మధ్యాహ్నం 12.45 గంటలకు రథం చేరుకుంది. అక్కడ 10 నిమిషాలు గడిపిన అనతరం 12.50కి రథం ముందుకు కదిలింది. దవణ మండపం వద్ద అనవాయితీగా ఆగింది. మంగళ మహాహారతి ఇచ్చిన అనంతరం ఎటువంటి ఆటంకాలు లేకుండా మధ్యాహ్నం 1.40 గంటలకు హిందూపురం క్రాస్ చేరుకుంది. అక్కడ రథం కుడివైపు మోకు తెగిపోవడంతో దాదాపు గంటన్నర పాటు నిలిచిపోయింది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు భక్తుల గోవింద నామస్మరణతో రథం ప్రారంభమైంది. యువకులు రెట్టించిన ఉత్సాహంతో రాథాన్ని లాగారు. మధ్యాహ్నం 3.56 గంటలకు రథం యథాస్థానానికి చేరుకుంది. రథోత్సవం దాదాపు 7.40 గంటల పాటు కొనసాగింది.

హాజరైన ప్రముఖులు

రథోత్సవానికి ముందు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు రథం పై ఉండి భక్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రథోత్సవంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, రాయలసీమ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తరువాత రథం వెనుక మొద్దులు తొక్కిన కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు శ్రీవారి మొదటి దర్శనం కల్పించారు.

భక్త జనసంద్రం

ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి తరలివచ్చిన భక్తులతో కదిరి వీధులన్నీ బుధవారం రాత్రి నుంచే కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపడానికి కూడా వీలులేకపోయింది. రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకోవడానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. నిప్పులు చెరిగే ఎండను సైతం లెక్కచేయకుండా మిద్దెలు ఎక్కారు. రోడ్లపై నిలబడ్డారు. 'నాలుగు గోపురాల వాడా.. గోవిందా.. లక్ష్మీ నారసింహా.. గోవిందా' అంటూ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. తేరుపై దవణం, మిరియాలు చల్లారు. రథ చక్రాల క్రింద గుమ్మడికాయలు ఉంచారు. రథం పై నుంచి జాలువారిన మిరియాలను ఏరుకునేందుకు ప్రయత్నించారు. తిరుగు ప్రయాణంలో కదిరి కుంకుమ, దవణం, తినుబండారాలు, ఆట వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేశారు. దుకాణాలు కిటకిటలాడాయి. యువతీ యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించారు. సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవం ముగిసిన తర్వాత అలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. పలువురు భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి, భృగుతీర్థంలో స్నానాలు ఆచరించి, శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రసాదాల కొనుగోలు కోసం భక్తులు బారులు తీరారు. చాలా మంది పచ్చబొట్లు వేయించుకోవడానికి బారులు తీరారు.

పటిష్ట బందోబస్తు

రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శివనారాయణ స్వామి అధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది, పారామిలటరీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. బుధవారం రాత్రి నుంచే వాహనాలను దారి మళ్లించారు. హిందూపురం, బెంగళూరు వైపు బస్సులను కదిరి శివారులోనే నిలిపివేసి, అక్కడే తాత్కాలిక బస్టాప్ ఏర్పాటు చేశారు. క్లాక్ టవర్, కోనేరు, జీవిమాను సర్కిల్, వలిసాబ్ రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తిరువీధుల్లోకి వాహనాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎస్పీ రత్న రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి దవణం సమర్పించారు.

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అందజేసే ప్రధానమంత్రి యోగా అవార్డు-2025కి అర్హులైన అభ్యర్థులు, సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. యోగా ప్రచారం, అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు కనీసం 20ఏళ్లుగా యోగా సేవలో ఉంటూ, వయసు 40ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు, సంస్థలు ఈనెల 31వ తేదీలోపు http:///innovateindia.mygov.in/pmyogaawards2025 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9959517370 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కార్బైడ్ వినియోగిస్తే చర్యలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పండ్ల వ్యాపారులు కాల్షియం కార్బైడ్ ఉపయోగించి కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆహారభద్రత శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. కార్బైడ్ ఉపయోగించిన పండ్లను విక్రయిస్తే ఆరు నెలలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. పండ్ల వ్యాపారులు సహజ సిద్ధంగా మాగిన పండ్లను విక్రయించాలన్నారు.

ఏప్రిల్ 27న బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జొనాథన్ గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ వస్తున్న నేపథ్యంలో మరో ఏడు పరీక్షా కేంద్రాలను పెంచామన్నారు. గతంలో నాలుగు ఉండగా పెంచిన వాటితో కలిపి ఆ సంఖ్య 11కి చేరిందన్నారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ఈనెల 22తో ముగియనున్న దరఖాస్తు గడువును 25వ తేదీ వరకూ పొడిగించామన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866559653, 9052316764 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

యాడికి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష రాయడానికి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. ఇంటికి తిరిగి రాకపోవడంపై విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈనెల 17న పరీక్ష రాయడానికని చెప్పి ఇంటి నుంచి అనంతపురం బయల్దేరి వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు



రైల్వేట్రాక్ నుంచి మహిళను తీసుకొస్తున్న సీఐ

హిందూపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకున్న మహిళను పురం పోలీసులు రక్షించారు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేపాక్షి గ్రామానికి చెందిన మీనాక్షి భర్త ప్రమాదంలో మరణించాడు. అతడి బీమా డబ్బు తనకివ్వకుండా కుటుంబ సభ్యులే వాడుకున్నారని మీనాక్షి ఆరోపించింది. పలుసార్లు డబ్బు అడిగినా ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. హిందూపురంలో రైలు పట్టాలపైకి వెళ్లి తల్లికి ఫోన్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చింది. వెంటనే ఫోన్ స్విచాఫ్ చేసింది. కుటుంబ సభ్యులు లేపాక్షి పోలీసులకు సమాచారం అందించారు. వారు సీఐ అంజనేయులుకు చెప్పారు. చివరగా మాట్లాడిన ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా హుటాహుటిన రైలు పట్టాల వద్దకెళ్లి మహిళను గుర్తించారు. ఆత్మహత్య ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన కేసు..

ముద్దాయికి 20 ఏళ్ల జైలు

అనంత పోక్సో కోర్టు సంచలన తీర్పు

కదిరి లీగల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి, గాయపరచిన ఆటో డ్రైవర్ చిరంజీవికి అనంతపురం జిల్లా పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. రూ.వెయ్యి జరిమానా, రూ.3లక్షల పరిహారాన్ని చెల్లించాలని న్యాయాధికారి రాజ్యలక్ష్మి ఆదేశించారు. కదిరి సీఐ నారాయణరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. 2019 మార్చి 17న కదిరి మున్సిపాలిటీ పరిధిలోని ఓ పల్లెకు చెందిన విద్యార్థిని ఒంటిపూట బడి ముగించుకుని ఇంటికి వెళ్లడానికి వేచి ఉంది. ఆ బాలిక, మరో బాలుడిని గమనించిన నీటి సరఫరా చేసే ఆటో డ్రైవర్ చిరంజీవి, ఇంటివద్ద దింపుతానని నమ్మబలికాడు. బాలుడిని ఆటో పక్కన, బాలికను తనమీద కూర్చోబెట్టుకున్నాడు. ఈ క్రమంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. భయపడిన బాలిక, బాలుడు కేకలు పెట్టారు. దీంతో వారిని ఆటో నుంచి దింపేసి చిరంజీవి పారిపోయాడు. విషయం తెలుసుకుని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చార్జిషీట్ వేశారు. అనంత పోక్సో కోర్టు విచారణ చేపట్టింది. సాక్ష్యాధారాల పరిశీలన, వాదోపవాదనలు విన్న అనంతరం న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

ఎస్కేయూలో విద్యార్థుల గొడవ

16 మందిపై కేసు నమోదు

అనంతపురం క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో న్యాయ, ఎంబీఏ విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. పరస్పరం దాడి చేసుకోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన 16 మంది విద్యార్థులపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు, బుధవారం రాత్రి 11గంటల సమయంలో ఎంబీఏ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు తమ వసతి గృహంలో ఫ్రెషర్స్ పార్టీ జరుపుకుంటున్నారు. లా స్టూడెంట్ విశ్వరూపాచారి అక్కడికి వెళ్లి వీడియోలు తీయడం ప్రారంభించాడు. ఎంబీఏ విద్యార్థులు ప్రశ్నిస్తే.. ఇక్కడ ర్యాగింగ్ జరుగుతోందని తెలిసి వీడియో తీస్తున్నానని అన్నాడు. ర్యాగింగ్ జరగడం లేదని, ఫ్రెషర్స్ పార్టీ చేసుకుంటున్నామని, వీడియోలు తీయవద్దని సూచించారు. ఈ క్రమంలో గొడవ మొదలైంది. అదే సమయంలో లా విద్యార్థులు భరత్ కుమార్ రెడ్డి, మరికొందరు అక్కడికి వచ్చారు. రెండు వర్గాలు కలబడ్డాయి. గొడవలో భరత్‌కుమార్ రెడ్డి, నరేష్ నాయక్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో తొమ్మిది మంది లా విద్యార్థులు, ఏడుగురు ఎంబీఏ విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

ఈకేవైసీ చేయించుకున్న వారికే రేషన్: జేసీ

అనంతపురం టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే సరుకులు అందుతాయని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులో ఎంతమంది సభ్యులుంటే అందరూ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇంకా కొందరు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. అలాంటివారు నెలాఖరులోగా రేషన్‌షాపు, గ్రామరెవెన్యూ అధికారి, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వద్దకెళ్లి ఈకేవీసీ చేయించుకోవాలని జేసీ కోరారు.

ఐపీ పెట్టిన దళారీ నిర్బంధం

పోలీసుల జోక్యంతో విడుదల

కణేకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పంట విక్రయించిన సొమ్ము ఇవ్వకుండా ఐపీ నోటీసులు పంపిన దళారీ, అతడి కుమారుడిని మండలంలోని హనకనహాళ్ గ్రామంలో రైతులు గురువారం నిర్బంధించారు. మండలంలోని హనకనహాళ్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పలువురు రైతుల నుంచి దాదాపు రూ.3కోట్ల విలువ చేసే పప్పుశనగ కొనుగోలు చేశాడు. ఏడాది క్రితం రైతులు డబ్బు అడగ్గా.. అతడు గ్రామం విడిచి వెళ్లిపోయాడు. తరువాత రైతులకు ఐపీ నోటీసులు పంపించాడు. కొన్నిరోజుల తర్వాత గ్రామానికి వచ్చిన కృష్ణారెడ్డి, అతడి కుమారుడు సోమశేఖర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పలు దఫాలు రైతులు, దళారీతో చర్చించి కోటి రూపాయల మేర చెల్లించేలా ఒప్పందం కుదిర్చారు. ఆ సొమ్ము కృష్ణారెడ్డి ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన హనకనహాళ్, బెళుగుప్ప తదితర గ్రామాలకు చెందిన రైతులంతా కృష్ణారెడ్డి ఇంటికి చేరుకుని అతడితోపాటు కుమారుడిని గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి, కూర్చోబెట్టారు. డబ్బు చెల్లించే వరకు ఇక్కడి నుంచి వెళ్లరాదని స్పష్టం చేశారు. రైతులు కూడా అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది గ్రామానికి చేరుకుని రైతులు, దళారీతో చర్చించారు. వచ్చే నెలలో డబ్బు చెల్లిస్తానని దళారీ చెప్పడంతో పోలీసులు సర్దిచెప్పారు. దీంతో వారు వెళ్లిపోయారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 125 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వర్గీకరణకు ఆమోదంపై సంబరాలు

అనంతపురం టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టానికి గురువారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) నేతలు సంబరాలు చేసుకున్నారు. చట్టానికి ఆమోదం తెలిపిన వెంటనే జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు పెద్దఎత్తున మాదిగ ఉద్యోగులు తరలివచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చడం పట్ల స్వీట్లు పంచుకుని, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్, నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

30 ఏళ్ల కల సాకారం

టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీతో ఆమోదం తెలపడం ద్వారా 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నాయుడు సాకారం చేశారని టీడీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు వన్నూరప్ప, వెంకటేష్, కదిరప్ప, ఎమ్మార్పీఎస్ నేత చెన్నకేశవులు గురువారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు తీసుకున్నారు..

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



ఓబునాథ్ (ఫైల్)

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల గురువారం ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించిందని పట్టణంలోని గిర్రాజు కాలనీలో ఓబునాథ్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గిర్రాజు కాలనీకి చెందిన దీనబంధు కుమారుడు ఓబునాథ్ టైల్స్ పనికి వెళ్తుండేవాడు. ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లికి ఆ అమ్మాయి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓబునాథ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లిన కుటుంబసభ్యులు కాసేపటికి వచ్చి చూడగా.. ఓబునాథ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఓబునాథ్ తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి యువకుడు..

అనంతపురం న్యూటౌన్(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ సెకండ్ క్రాస్‌కు చెందిన అమ్మినేని తరుణ్‌కుమార్ (28) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక మారుతీ నగర్ సమీపంలో రైలు పట్టాలపై గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని శవం రైలు పట్టాలపై ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ వెంకటేష్ వెళ్లి, పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాల ప్రకారం అతడు అశోక్‌నగర్ సెకండ్ క్రాస్‌కు చెందిన అమ్మినేని వెంకటనాయుడు, రమాదేవి దంపతుల కుమారుడు తరుణ్‌కుమార్‌గా గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు ప్రమాద స్థలానికి చేరుకుని, విలపించారు. ఎంబీఏ వరకు చదివిన తరుణ్ కుమార్ వ్యసనాలకు బానిసై, ఇంట్లో వారితో తరచూ గొడవ పడుతుండేవాడు. బుధవారం రాత్రి కూడా వారితో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బూదిలిలో యువతి..



విమల (ఫైల్)

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన విమల (24) గురువారం ఇంట్లోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకుంది. బూదిలికి చెందిన నరసింహులు, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. విమలను చిన్నప్పటినుంచి బూదిలిలోనే ఉంటున్న మేనత్త, మేనమామ కిష్టప్ప, నాగలక్ష్మి పెంచుకుంటున్నారు. విమల తల్లిదండ్రులు బెంగుళూరుకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. విమల డిగ్రీ పూర్తి చేసి, గోరంట్లలోని ఎమ్మార్సీలో దివ్యాంగురాలైన టీచర్ నిర్మలకు సహాయకురాలిగా వ్యవహరిస్తుండేది. రోజూ పాఠశాలకు వెళ్లి వచ్చేది. ఈ నేపథ్యంలోనే గురువారం మేనత్త ఇంట్లో పైకప్పునకు చీరతో ఉరేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి, గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే యువతి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉంది. బెంగళూరు నుంచి వచ్చిన తల్లి నారాయణమ్మ.. అనారోగ్య కారణాలతోనే విమల ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఐ శేఖర్ కేసు నమోదుచేసి, యువతి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

గుత్తి, మార్చి20(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని యువకుడు రాజశేఖర్(28) మృతిచెందాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జక్కలచెరువు ఆర్ఎస్‌కు చెందిన రాజశేఖర్ భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి బయటకు వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. మద్యం మత్తులో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. రాజశేఖర్‌కు ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అణగారిన కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లుటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): అణగారిన కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మదాసి/మదారి కురుబ కులాన్ని 1956లోనే ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. రాష్ట్ర ఎస్సీ జాబితాలో 31వ వరుస సంఖ్యలో మదాసి కురువ కులం ఉన్నా.. సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాలను జారీచేసే అధికారాన్ని ఆర్డీవో నుంచి తహసీల్దారుకు బదలాయించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే బోయలను ఎస్టీ జాబితాలోకి, బేడ బుడగజంగం, చాకలి కులాలను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కులాలన్నింటినీ పలు రాష్ట్రాలు, కేంద్రం ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించాయన్నారు. ఈ డిమాండ్‌పై ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

న్యూస్ బాక్స్

పన్నులు చెల్లించి... అభివృద్ధికి సహకరించండి

గార్లదిన్నె, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పన్నులు, షాపుల లైసెన్స్ ఫీజులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని గార్లదిన్నె పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గ్రామస్థులకు సూచించారు. పంచాయతీ పరిధిలోని అనేక మంది ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. గార్లదిన్నెలో అనేక రకాల షాపులు నిర్వహిస్తున్నారని వారందరు పంచాయతీకి లైసెన్స్ కట్టాలని సూచించారు. పంచాయతీకి లైసెన్స్ కట్టని వారిపై చట్టపరంగా జరిమాన విధిస్తామని గురువారం ప్రచారం చేయించారు.

'వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలి'

నార్పల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు పనిచేసేటప్పుడు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలని సర్పంచు సాకే రామాంజినేయులు, బీ పప్పూరు ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు హజీరా పేర్కొన్నారు. నార్పం మండలం సిద్ధారాచర్ల గ్రామ పంచాయతీ లోని దుర్గం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ప్రదేశంలో సర్పంచు సాకే రామాంజినేయులు కూలీలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. పలు సూచనలు చేశారు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపీహెచ్‌ఓ శివకుమార్, అమృతాంజలి, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

రామగిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్లు కేజీబీవీ ఎస్‌ఓ స్వర్ణలత గురువారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 7,8,9 తరగతులతో పాటు సీనియర్ ఇంటర్‌లో సీట్లభర్తీ కోసం బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 11 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

అనంతపురం రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని నరసనాయునికుంట గ్రామస్థులు కోరారు. ఆ మేరకు గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దివాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో నీరు పుష్కలంగా ఉన్న వినియోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ సర్పంచు కుమారుడు శ్రీనివాసులుతోపాటు మరో ఐదుగు నీటి సరఫరా ప్రధాన పైపులైన్‌కు కనెక్షన్ తీసుకుని వారి ఇళ్లకు, ఇతరత్ర వాటికి వాడుకుంటున్నారని తెలిపారు. గ్రామస్థులు వెంకట నాయుడు, పవన్‌కుమార్, ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబును దూషించిన వారికి ప్రమోషన్లా?

● మండిపడ్డ ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం సెంట్రల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేతగా నారా చంద్రబాబు నాయుడిని దూషించి, అవహేళన చేసిన వారికి నేడు ప్రమోషన్లు ఇస్తారా అని ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా చేపట్టిన ప్రమోషన్లను నిలిపి వేయాలని గురువారం ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితను కలిసి వినతి పత్రం అందజేశారు. అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారిని... ప్రభుత్వాన్ని, న్యాయవ్యవస్థను పక్కదారి పట్టిస్తున్న వారిని తొలగించి జీఓ 203ను అమలు చేయాలన్నారు. నాయకులు బాలకృష్ణ, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ఎరా విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో చైర్మన్, ప్రిన్సిపాల్

అనంతపురం రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ సిల్వర్ జోన్ ఒలంపియాడ్‌లో ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. ఆ విద్యార్థులను గురువారంపాఠశాల యాజమాన్యం అభినందించారు. పాఠశాల చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. ఒలంపియాడ్ పరీక్షల్లో గణిత సబ్జెక్టులో తమ పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో నాలుగు స్వర్ణం, మూడు రజతం, ఒక కాంస్యం పతకాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు.

జేఎన్టీయూలో విద్యా ప్రమాణాల పెంపు : ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యా ప్రమాణాలను పెంచేలా చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కళాశాలలో నిర్వహించిన ఎక్స్టర్నల్ కమిటీ పరిశీలన గురువారంతో ముగిసింది. కమిటీ సభ్యులు చంద్ర ఓబుళరెడ్డి, నాగభూషణం రాజు, నాగరాజు, సుబ్రమణ్యం శర్మ, కోఆర్డినేటర్ చంద్ర మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంధుల విద్యాభ్యాసానికి హుందాయ్ తోడ్పాటు

అనంతపురం సెంట్రల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): అంధుల విద్యాభ్యాసానికి ప్రముఖ హుందాయ్ మొబిస్ ఇండియా మోడల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ తోడ్పాటును అందించింది. సామాజిక సేవలలో భాగంగా గురువారం మీనాక్షమ్మ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీఐఈడబ్ల్యూ- పీడ బ్ల్యూడీ)కు కంప్యూటర్ పరికరాలను వితరణచేశారు. హుందాయ్ ఎండీ యంగ్ యోంగ్ డెక్, హెచ్‌ఆర్ హు మిన్ హో, హెచ్‌జీఏ హెచ్‌ఓడీ శ్రీనివాస్‌లు వీఐఈడబ్ల్యూ-పీడబ్ల్యూడీ అధినేత వెంకట రమణ, రవికాంత్ రమణతో కలిసి విద్యార్థులకు పంపిణీచేశారు. పది కంప్యూటర్లు, 25 ల్యాప్‌టాప్స్, 35 హెడ్‌సెట్స్, 25 ప్రింటర్లు, నాలుగు బ్రయిల్ టైప్ మిషన్లను అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి : పీఎస్‌ఎఫ్‌ఐ

అనంతపురం సెంట్రల్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కేఎస్ఎన్ బాలికల కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని పీఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు వారు గురువారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు పార్వతి, మౌని, గని, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వేడుకలు

అనంతపురం నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పక్కీరప్ప అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు కరస్పాండెంట్ రాధ, డైరెక్టర్లు జయరాం చౌదరి, రవీంద్ర చౌదరి హాజరై ప్రారంభించారు. వారిని ఘనంగా సన్మానించారు.

పోక్సో కేసులో కర్నూలు యువకుడికి రిమాండ్

అనంతపురం క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్నూలు జిల్లాకు చెందిన యువకుడిని వన్‌టౌన్ పోలీసులు రిమాండ్‌కు పంపారు. మూడు రోజుల క్రితం నగరంలోని ఓ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైంది. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం ఎర్రగుడికి చెందిన బండారి మహేష్ తీసుకెళ్లినట్లు తేలింది. వారిని పిలిపించి మహేష్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం అతడిని రిమాండ్‌కు తరలించారు.

ప్రయాణికులకు నీడ ఏదీ?

● నగరంలోని సర్కిళ్లలో కనిపించని బస్ షెల్టర్లు, పరదాలు

● మండుటెండలో ఉక్కిరిబిక్కిరవుతున్న వాహనదారులు, ప్రయాణికులు



కళ్యాణదుర్గం బైపాస్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు





కళ్యాణదుర్గం బైపాస్ సర్కిల్లో మండుటెండలో నిలిచిన వాహనాలు



సూర్యానగర్ రోడ్డులో బస్సుల కోసం ఎర్రటిఎండలో ప్రయాణికులు



శ్రీకంఠం సర్కిల్లో బస్సుల కోసం ఎండలో ప్రయాణికులు



బళ్లారి బైపాస్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం వచ్చిం దంటే చాలు... నగరంలో రోడ్లపై ప్రయాణించే వాహనదారులు, పాదాచారు లు ఉక్కిరిబిక్కిరవుతుంటారు. ఇక సర్కిళ్లు, బస్టాప్‌ల వద్ద నిలబడిన సమ యంలో వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ప్రయాణికులను ఎండబారి నుంచి తప్పించేందుకు ప్రతి ఏడాది నగరంలోని పలు సర్కిళ్లు, బస్టాప్‌లలో పరదాలు కట్టేవారు. ఆ నీడలో కాస్త ఉపశమనం పొందే వీలుంటుంది. ఈ ఏడాది మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. కనీసం సర్కిళ్లల్లో కనీసం రెండు నిమిషాలు నిలబడలేని పరిస్థితి. అయితే సంబంధిత అధి కారులు మాత్రం ఈ ఏడాది సర్కిళ్లల్లో పరదాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ట్రాఫిక్ సిగ్నల్ సమయంలో ప్రధాన సర్కిళ్లల్లో నిలబడే వాహన దారులు ఎండకు మండిపోతున్నారు. నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్, శ్రీకంఠం సర్కిల్, సూర్యానగర్ రోడ్డు, నడిమివంక సర్కిల్, బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు, వాహనదారులు ఎండవేడిమిని భరించకలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరదాలు, బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సీఎంతో ఎమ్మెల్యే దగ్గుపాటి భేటీ

● అనంత రాజకీయ పరిణామాలపై చర్చ



సీఎంకు పలు అంశాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం లో తాజా రాజకీయ పరి ణామాలపై సీఎం చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చర్చించారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సీఎం ఛాంబర్‌కు ఎమ్మెల్యే వెళ్లి, నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డు తరలింపు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మరువ, నడిమివంకల ప్రొటెక్షన్ వాల్స్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను సీఎంకు వివరించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి

అనంతపురం న్యూటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) పంచాయతీ కార్యదర్శులు ఎదర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఓఎస్‌డీ వెంకటక్రిష్ణకు వినతి పత్రం అందించారు. గ్రేడ్‌ల కుదింపు విషయంపై ఆయనతో చర్చించినట్లు సమాఖ్య నాయకులు తెలిపారు. పంచాయతీ స్థాయిలో విధి నిర్వహణతో పాటు సచివాలయ సిబ్బంది పని తీరు, ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన, ప్రభుత్వ సర్వేలను మాని టరింగ్ చేయడం ఇబ్బందికరంగా మారిందని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమాఖ్య నాయకులు తెలిపారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, నరేంద్ర, బాబురావు, మొహిద్దీన్, సాయిరామ్, కొండలు పాల్గొన్నారు.

'స్పాట్' నుంచి 55 ఏళ్ల టీచర్లను మినహాయించాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ డ్యూటీ నుంచి 55 ఏళ్లు నిండిన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, ఇతర నాయకులు సైన్స్ సెంటర్‌లో గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. పది మూల్యాంకనం నుంచి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మహిళా టీచర్లు, వయస్సు పైబడిన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా సెలవు రోజుల్లో విధులకు హాజరైన టీచర్లకు సీసీఎల్ మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం నాయకులు సూర్యుడు, శివయ్య ఆచారి, మల్లికార్జున, చంద్రశేఖర్, నాగభూషణతదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టండి

● ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి నారాయణ స్కూళ్లలో ఇప్పటి నుంచే పుస్తకాల వ్యాపారం ప్రారంభించారని, వెంటనే కట్టడి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఇతర నాయకులు గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును సైన్స్ సెంటర్‌లో కలిశారు. జిల్లాలోని రాయదుర్గంలో ఉన్న నారాయణ స్కూల్‌లో తరగతుల ను బట్టి రూ. 13 వేలు, రూ. 16 వేల వరకూ అమ్ముతున్నారన్నారని డీఈఓకు వినతిపత్రం అందించారు. సంఘం నగర సహాయ కార్యదర్శి సమీర్, ఇతర నేతలు మోహన్, తరుణ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

పందుల అపహరణ

అనంతపురం క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలో 40 పందులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నగరంలోని ఎరుకుల వెంకటేష్ అనే వ్యక్తి హైవేలోని ఓ హోటల్ వెనుక వైపున్న స్థలంలో పందుల ను మేపుతున్నాడు. గురువారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఐషర్ వాహనంలోకి ఎక్కించి తీసుకెళ్లారు. అక్కడ కాపలా ఉన్న వారు వారిని నిలువరించలేకపోయినట్లు తెలిసింది. బాధితుడు నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సీసీ ఫుటేజీ రికార్డులు పరిశీలించారు. కాగా ఆ వాహనం కర్నాటకకు చెందిన వాహనంగా పోలీసులు భావిస్తున్నారు.

ఫుట్‌బాల్ కప్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గురువారం ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్ పోటీలను ప్రారంభించారు. తుంగభద్ర జట్టుపై పెన్నా జట్టు 4 గోల్స్ తేడాతో విజయం సాధించగా.... నల్లమల జట్టుపై కోరమాండల్ జట్టు 2 గోల్స్ తేడాతో, గోదావరిపై కొల్లేరు 3గోల్స్, విశాఖపై వంశధార జట్టు 3 గోల్స్ తేడాతో గెలుపొందాయి. మొట్ట మొదటిగా రాష్ట్రంలో 26 జిల్లాల్లోని ఫుట్‌బాల్ క్రీడాకారులను మునుపెన్నడూలేని విధంగా ఎనిమిది జట్లు (క్లబ్)గా ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో పోటీ లు నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేత జట్టుకు రూ. 5లక్షలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులివ్వండి

●ఎంఎస్ రాజుకు చెన్నేకొత్తపల్లి వాసుల వినతి



ఎంఎస్ రాజుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, చెన్నేకొత్తపల్లి వాసులు

అనంతపురం/చెన్నేకొత్తపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో ఉన్న పురాతన అహోబిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి నిధులివ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి చెన్నేకత్తపల్లి గ్రామస్థులు టీటీడీ బోర్డు సభ్యులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం వారు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి తన ఛాంబర్‌లో ఉన్న ఎంఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. రూ.1.25 కోట్లతో అంచనాలు తయారు చేశామన్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 20 నుంచి 30 శాతం నిధులను సమకూర్చుకుంటామన్నారు. దేవాదాయ శాఖ నిధుల నుంచి లేదా తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల నుంచి కానీ నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు ఎంఎస్ రాజు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

'నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు'

కనగానపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటా యని ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, డీపీఈఓ గోవింద నాయక్, ఏఈఎస్ శ్రీరామ్ తెలిపారు. మండలపరిధిలోని వేపకుంట, మద్దలచెరువు, భానుకోట, వారాదిపురం గ్రామాల్లో గురువారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. కళాజాతా బృందం ద్వారా ప్రజలకు నాటుసారా అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఫరక్ ఆజాం, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు, అమిలినేని, దగ్గుపాటి



ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ తదితరులు



బ్యాడ్మింటన్‌లో విన్నర్స్ కప్ అందుకుంటున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

23న హాకీ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి హాకీ జూనియర్ బాలుర జట్టు ఎంపిక పోటీలను ఈనెల 23న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు. 2006 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్టు ఏప్రిల్ 6న ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు సెల్ ఫోన్ నంబరు 9490033474ను సంప్రదించాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు సహకరించండి

● ఉప ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండలాల్లో వేసవి కాలంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వినతి పత్రం అందజేశారు. ఆమె గురువారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఉప ముఖ్యమంత్రిని ఆయన చాంబర్‌లో కలిశారు. శింగనమల నియోజకవర్గంలోని పలు మండలాల్లో వేసవి వస్తే నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని తెలిపారు. కావున నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని, అలాగే జల జీవన్ మిషన్ కింద గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి సానూకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కార్మికులు తప్పక ఆప్రాన్ వేసుకోవాలి : కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఆప్రాన్ వేసుకుంటేనే ఉద్యోగానికి రావాలని లేదంటే అవసరం లేదని నగర కమిషనర్ బాల స్వామి స్పష్టం చేశారు. ఆయన గురువారం నగరంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రధాన రహదారుల్లో స్వీపింగ్ చేసే సమయంలో వాహనాలు వస్తుంటాయని, ఆప్రాన్ వేసుకుంటే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీసేటప్పుడు కార్మికుల చేతికి హ్యాండ్ గ్లౌస్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. అంబేడ్కర్ నగర్‌లో మేజర్ డ్రైనేజీని స్థానిక కార్పొరేటర్ చంద్రలేఖతో కలిసి సందర్శించారు. అనంతరం శారదానగర్, నవోదయకాలనీ, హౌసింగ్‌బోర్డు, విద్యుత్‌నగర్, అరవిందనగర్ తదితర ప్రాంతాల్లో పనులు పరిశీలించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి : పీడీ

అనంతపురం విద్య, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ భీ- పఢాయిభీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి పేర్కొన్నారు. నగరంలోని మహిళా ప్రాంగణంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు అందించే పోషణ్ భీ- పఢాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్ర మంలో అనంతపురం సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్లు విష్ణువర్ధని, కొండమ్మ, విజయ, హేమలత తదితరులు పాల్గొన్నారు. అలాగే రాప్తాడు, కనగానపల్లి, రామగిరి, శింగనమల తదితర మండలకేంద్రాలోని ఐసీడీఎస్ కార్యాల యాల్లో పోషణ్ భీ- పఢాయి భీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రేపు, ఎల్లుండి ఏఐటీయూసీ శిక్షణా తరగతులు

అనంతపురం విద్య, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ శిక్షణా తరగతులు శనివారం, ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సం ఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సత్య సాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హాజరవుతారని తెలిపారు.

ఓటరు జాబితాపై శిక్షణ

గార్లదిన్నె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని హెచ్‌ఎన్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఓటరు జాబితాపై బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ మల్లికార్జునుడు హాజరయ్యారు. తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వండి

చెన్నేకొత్తపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తక్కువ నీటితో పండే చిరుధాన్యాలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మేరి వటమట్టం, బబ్లూ గంగూలి పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని టింబక్టు కలెక్టివ్ కార్యాల యంలో గురువారం రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీచేశారు. సీకేపల్లి, రొద్దం, రామగిరి మండలాలలకు చెందిన 28 మంది రైతులకు అందజేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయండి

● రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌ను కలిసిన మండ్ల నాగేష్

బుక్కరాయసముద్రం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిం చాలని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్‌ను జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మండ్ల నాగేష్ కోరా రు. ఆయన గురువారం విజయవాడలో ని రాష్ట్ర సచివాలయం లో రాష్ట్ర కమిషనర్‌ను కలిసి ఉమ్మడి జిల్లాలో మత్స్యకారుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కేజీబీవీలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ నిర్మల గురువారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 22నుంచి ఏప్రిల్ 11వ తేదీవరకు వరకు అందుబాటులో ఉంటాయన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన వారు పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోనికి తీసుకుంటామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్, మెసెజ్ రూపంలో సమాచారం అందిస్తామని అన్నారు. వివరాలకు 7075159996, 7075039990 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

విడపనకల్లు: మండలం కేంద్రంలోని కేజీబీవీలో 6 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తుల సీప్రియ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే 9వ తరగతిలో ఒక సీటు ఉందన్నారు. వివరాలకోసం 6302359871 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్కేపీ కాలేజీలో ఉపాధి కోర్సుల పైలెట్ ప్రోగ్రాం

గుంతకల్లు/గుంతకల్లుటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తయిన వెంటనే స్కిల్డ్ ఉద్యోగావకాశాలు లభించేలా ప్రభుత్వం చేపట్టిన ఉపాధి కోర్సుల పైలెట్ ప్రోగ్రామ్‌కు పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపికైంది. ఈ మేరకు వివరాలను ప్రిన్సిపాల్ లక్ష్మయ్య గురువారం కళాశాలలో వెల్లడించారు. ఈ పైలెట్ ప్రోగ్రాంపై ఇద్దరు సభ్యులు **నగేష్‌బాబు, రాజాహర్ష** కళాశాలకు వచ్చి వసతులను పరిశీలించారని, అప్రెంటీస్‌తో కూడిన డిగ్రీ ప్రోగ్రాం (ఏఈడీపీ) కింద కోర్సులను ప్రవేశపెట్టడానికి ఆమోదం తెలిపారని అన్నారు. జిల్లాలో అనంతపురం, గుంతకల్లు, ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఈ పైలెట్ ప్రోగ్రామ్‌కు ఎంపియ్యాయని చెప్పారు. **సీఆర్ఐఎస్పీ సంస్థ, ఇతర సంస్థలతో పరస్పర సహకారంతో ఈ కోర్సులపై విద్యార్థులకు నైపుణ్యాన్ని** పెంపొందిస్తారన్నారు. కార్యక్రమంల వైస్ ప్రిన్సిపాల్ ఏ రవిశంకర్ శర్మ, అకడమిక్ కో-ఆర్డినేటరు పావని, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జహ్రుల్లా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న ఈశ్వర్

పామిడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ రూ. 50వేలు వితరణ చేశారు. కర్నూలు జిల్లా ఆలూరులో గురువారం ఆయన్ను కలిసిన గ్రామపెద్దలకు, ఆలయ నిర్వాహకులకు నగదును అందజేశారు. మాజీ సర్పంచు ముంటిమడుగు సుంకప్ప, చెరువు మాజీ ప్రెసిడెంట్ భాస్కర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

బొమ్మనహాళ్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో దర్గా దర్శనం కోసం వచ్చిన ఓ భక్తుడికి చెందిన ద్విచక్రవాహనం చోరీకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన వన్నూరు స్వామి గురువారం దర్గాకు వచ్చాడు. ద్విచక్రవాహనాన్ని దర్గా ముందు నిలిపి స్వామిని దర్శించుకునేందుకు లోనికి వెళ్లాడు. తిరిగి బయటకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు.

ల్యాప్‌టాప్‌ల వితరణ

పెద్దవడుగూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజల అవసరాల నిమిత్తం హౌసింగ్ డిపార్ట్‌మెంట్, ఉపాధిహామీ అధికారులకు రూ.లక్ష విలువ గల 2ల్యాప్‌టాప్‌లను జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి వితరణ చేశారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ బారెన్‌షాబుకు వాటిని అందించారు. ఏపీఓ పుల్లారెడ్డి, హౌసింగ్ ఏఈ బాలనెట్టికంటయ్య, అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపల్లిలో రైతు బెరీల రామాంజనేయులకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. తనకున్న రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశానని, గురువారం గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారని బాధిత రైతు వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారని, అప్పటికే ఎకరంలోని పంటతో పాటు డ్రిప్ వైరు, మోటారు కాలిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు దాదాపు రూ. 80 వేలు నష్టం వచ్చినట్లు చెప్పాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

శ్రీపురంలో వామి ..

గుత్తిరూరల్: మండలంలోని శ్రీపురం గ్రామంలో ఉంగ్ర శివ అనే రైతుకు చెందిన ఉద్దుల వామి గురువారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. తనకున్న మూడు ఎకరాలో ఉద్దులను సాగు చేశానని, ఇటీవల పంటతొలగించి పొలంలోనే వామి వేశానని, అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారని బాధిత రైతు వాపోయాడు. రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


విజ్ఞాన యాత్రకు విద్యార్థులు

బెళుగుప్ప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం ఉచిత ప్రదర్శనకు ప్రభుత్వం చర్యలు తీసుకోగా మండలం నుంచి 12 మంది విద్యార్థులు వెళుతున్నట్లు ఎంఈఓ మల్లారెడ్డి గురువారం తెలిపారు. బెళుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది, కోనంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి నలుగురు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం నుంచి బయలుదేరి వెళతారన్నారు.

పప్పుశనగ కొనుగోలుకు చర్యలు

బెళుగుప్ప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రబీ సీజన్‌లో పండించిన పప్పుశనగ పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలుకు చర్యలు తీసుకుందని ఏఓ పృథ్వీసాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్వింటాల్‌కు రూ.5650 చొప్పున ధర నిర్ణయించిందన్నారు. విక్రయించాలనుకున్న రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

మూతపడిన హాస్టల్ పరిశీలన


హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

శెట్టూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడు (పెరుగుపాళ్యం)లో మూతపడిన సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి గురువారం పరిశీలించారు. ఆ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని రెండు రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థి సంఘం నాయకులు ఆ హాస్టల్ భవనం ముందు ఆందోళన చేపట్టారు. 15 ఏళ్ల క్రితం మూతపడ్డ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని, ఈ వసతి గృహం మూతపడటం వల్ల ఎంతో మంది నిరుపేద దళిత విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వెంటనే అక్కడ మౌలిక వసతులు కల్పించి మళ్లీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం వివిధ పత్రికల్లో ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి ఆ వసతిగృహంను పరిశీలించారు. పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ముందుకెళుతామన్నారు. అందుకు ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ అధికారి నోటిదురుసు

● బేజారెత్తుతున్న ఉద్యోగులు


గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం

గుంతకల్లు టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ఓ పరిపాలనా అధికారి దురుసు తీరుతో మహిళా ఉద్యోగినులు బేజారెత్తున్నారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది సెలువులు అడగాలంటే హడలెత్తిపోతున్నారు. కార్యాలయంలో ఏదైనా పనిజరగాలంటే పైసా వసూల్ చేస్తున్నారని సైతం ఆయనపై ఆరోపణలు వినిపిస్తున్నా యి. బాధ్యతలు స్వీకరించిన అతి తక్కువ కాలానికే ఆయనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన బాధ్యతలు స్వీకరించనప్పటి నుంచి నోటి దురుసుతో ప్రవర్తిస్తున్నారని, అకారణంగా చీవాట్లు పెడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల ఓ సచివాలయ మహిళా ఉద్యోగి తన పెళ్లికి సెలవు కావాలని అడగ్గా.. నానా మాటలు అనిన తర్వాత సెలవు మంజూరు చేసినట్టు సమాచారం. ఉదయం వార్డుల్లో పారిశుధ్య పనుల తనిఖీకి వెళ్లి మహిళా సిబ్బంది కనిపించకపోవడంతో తిట్లపురాణం ఎత్తుకుంటారని పారిశుధ్య సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. తనిఖీల పేరిట సచివాలయలకు వెళ్లి మహిళా ఉద్యోగినులను తిట్టడం పనిగా పెట్టుకున్నాంటారని నిరసనలు సైతం వ్యక్తం అవుతున్నాయి. వార్డు సమస్యలు చెబితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారంటూ వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివాదాస్పద నిర్ణయాలు..

సున్నితమైన, మతపర అంశాలపై ఎక్కువగా స్పందించి వివాదాస్పదుడిగా ఈ అధికారి అపప్రథను మూటగట్టుకున్నారు. గత డిసెంబరులో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాద్ వ్రతం కోసం ఆలయ అధికారులు పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి చెత్త ట్రాక్టర్‌లో తరలించారు. దీంతో వివిధ మాలాదారులు ఈ అధికారితో వాగ్వాదానికి దిగారు. ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో కమిషనర్ స్వయంగా ఫెక్సీలను తిరిగి ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అలాగే కసాపురం రోడ్డులోని భవానీ ఆలయం వెనుక శివాలయం నిర్మాణంలో బండలు తొలగించడం సమస్యకు దారితీసింది. సున్నితమైన అంశాలను దురుసుగా చేస్తుండటంతో ఆయనపై ధార్మిక సంఘాలు, ప్రజా సంఘాల వారు నిరసనగళమెత్తుతున్నారు.

వసూళ్ల పర్వం..

మున్సిపల్ కార్యాలయంలో ఏదైనా పనులు జరగాలంటే ఈ అధికారికి డబ్బులు ముట్టజెప్పాల్సిందే. బర్త్ , డెత్ సర్టిఫికెట్లను మొదలుకుని ప్రతి విషయంలోనూ మామూళ్ల వసూలు చేస్తుండగా, అన్నింటిలోనూ ఈ అధికారి చేతివాటం ఉందని ఆరోపణలు వినస్తున్నాయి. అన్ని సెక్షన్లలోని వసూళ్లలో ఇతడు తన వంతు రాబట్టుకుంటారంటూ మున్సిపల్ సిబ్బందే బాహాటంగా చెప్పుకోవడం గమనార్హం. మూడు నెలల క్రితం ఓ రిటైర్డ్ ఉద్యోగి పెన్షన్ త్వరగా రావాలని కోరినందుకు రూ. 10 వేలు ఈయనకోసం వసూలు చేసినట్లు తెలసింది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల అద్దెలు పెంచకుండా ఉండేందుకు ఒక్కో షాపుదారుడి నుంచి పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నారని వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

మీసేవ కేంద్రాలకు పూర్వ వైభవంపై హర్షం


బెళుగుప్పలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప/ ఉరవకొండ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి ప్రభుత్వ పాలనలో మీ సేవ కేంద్రాలను అనుసంధానం చేస్తూ పూర్వ వైభవం కల్పించినందుకు బెళుగుప్ప మండలంలోని మీ సేవ నిర్వాహకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో మీ సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ పూర్వవైభవం తేవడం ఆనందాన్ని కల్గిస్తోందని పేర్కొన్నారు. మీసేవ నిర్వాహకులు గోవిందరాజులు, నాగభూషణ, కాలువపల్లి రఘు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ పట్టణంలో టవర్‌క్లాక్ కూడలిలో ఏపీ మీసేవ ఆపరేటర్ల సంక్షేమ సంఘం నాయకులు పవన్, జిలాన్ మంత్రులు నారాలోకేష్, పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సంఘం సభ్యులు దావుద్, అంజి, శ్రీనివాసులు గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ఉరవకొండ, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్షానుపల్లి గ్రామంలో పశువులకు వేస్తున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలలోగా వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. డీడీ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

తాడిపత్రి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హాజీవలిదర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. దర్గా వద్ద భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను ఈ సారి గతంలో కన్నా భిన్నంగా జరపాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి కమిటీ సభ్యులకు సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్

యాడికి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా వద్ది రాజశేఖర్ ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన బీజేపీ మండలస్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వీవీ ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ప్రసాద్ బాధ్యతలు

రాయదుర్గం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం అర్బన్ పీఎస్ ఎస్ఐగా ప్ర సాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇం తకుమునుపు ఎస్ఐ బాలరాజు అన్నమ య్య జిల్లా రాయచోటికి బదిలీ అయ్యారు. దీంతో చిత్తూరు జిల్లాలో ఉన్న ప్రసాద్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

థ్యాంక్యూ సీఎం సార్..



థ్యాంక్యూ సీఎం సార్ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

కళ్యాణదుర్గం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ నేత ధర్మతేజ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన క్రిస్టియన్ కార్పొరేషన్‌కు నేటి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.149 కోట్ల నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఇందుకు పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం క్రైస్తవులు సంబరాలు చేసుకున్నారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ధర్మతేజ మాట్లాడుతూ... బడ్జెట్‌లో రాష్ట్రప్రభుత్వం పాస్టర్లకు గౌరవ వేతనం, విదేశీ విద్య, సబ్సిడీ రుణాలు, జెరూసలేం యాత్రకు నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి సీఎం పెద్ద పీట వేశారని అన్నారు. క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటి స్వామిదాస్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్, పాస్టరు జాన్సన్ బాబు, జయరాజ్, మల్లికార్జున పౌల్, అజర్య, హరీష్, పిలిప్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూడేరులో కంటి వైద్య శిబిరం

కూడేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం మంత్రి పయ్యావుల సోదరుల సహకారంతో, నంద్యాలకు చెందిన శాంతిరామ్ మెడికల్ కాలేజి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీఐ రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, టీడీపీ నాయకులు జయప్రకాష్‌గౌడ్, బొమ్మయ్య, బాట వెంకటేష్, గొల్లవెంకటేష్, ఎద్దుల సుధాకర్, మరుట్ల రవి, సురేష్, ముట్టాల అక్కులప్ప, అంకె బీమా తదితరులు పాల్గొన్నారు.

వేములపాడులో పప్పుశనగ కొనుగోలు కేంద్రం

యాడికి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ కేంద్రంలో పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఏఓ మహబూబ్‌బాషా గురువారం ప్రకటనలో తెలిపారు. క్వింటా పప్పుశనగకు ప్రభుత్వం రూ.5650 మద్ధతు ధర ప్రకటించినట్లు చెప్పారు. విక్రయించాలనుకునే రైతులు ముందుగా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పప్పుశనగను కొనుగోలు కేంద్రంలో చేర్చిన తర్వాత వారంరోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు.


మట్కాబీటర్ల అరెస్టు

తాడిపత్రి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓంశాంతినగర్ సమీపంలోని చాంద్‌టాకీస్ ఖాళీ స్థలంలో మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో గురువారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి , సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్‌బాషా సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అందులో ఐదుగురు మట్కాబీటర్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.1.70లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరొక వ్యక్తి పరారయ్యాడని, త్వరలో అరెస్ట్‌చేస్తామని సీఐ తెలిపారు.

31లోగా ఈకేవైసీ పూర్తి చేయాలి

రాయదుర్గంరూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు ఉన్న వారికి ఈ నెల 31వ తేదీ లోగా ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన రూరల్, అర్బన్ రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీఆర్వోలు, డీలర్లు తక్షణమే రేషన్‌కార్డులు ఉన్న వారికి ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. ఈకేవైసీ కాని వారికి రేపు నెల బియ్యం సరఫరా కాదని తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

యాడికి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వేములపాడు, కోనుప్పలపాడు గ్రామాల్లో భూ రీసర్వేపై గ్రామస్థులకు అవగాహన కల్పించడం కోసం గురువారం ఆయన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సిబ్బంది, రైతులతో కలిసి అవగాహన ర్యాలీలు చేపట్టారు. తర్వాత గ్రామసభల్లో తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రీసర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వేకు భూయజమానులు సహకరించాలని కోరారు. గ్రామసభల్లో వేములపాడు సర్పంచు ఓంకారమ్మ, కోనుప్పలపాడు సర్పంచు రామలక్షుమ్మ, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుత్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు వక్తలు సూచించారు. పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో గురువారం మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. వాటిని వాడితే కలిగే కలిగే నష్టాలపై వివరించారు. కళాశాల సీఈఓ శ్రీరాములు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

విడపనకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోట గ్రామంలో గురువారం గడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. వీ కొత్తకోట గ్రామానికి చెందిన కురుబ సూరి పశువుల మేత కోసం కర్ణాటక రాష్ట్రం నుంచి జొన్నచొప్పను కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో లోడు చేసుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. గ్రామం వద్దకు రాగానే దారిలో వేలాడుతున్న విద్యుత్ తీగలు ట్రాక్టర్‌కు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన సూరి వెంటనే ట్రాక్టర్‌ను పక్కనే ఉన్న పొలంలోకి వెళ్లి ట్రాలీని లిఫ్ట్ ద్వారా పైకి ఎత్తి గడ్డిని కిందకు పడేశాడు. అయినా కూడా గడ్డితో పాటు ట్రాలీ కూడా కాలి పోయింది. దీంతో రూ.1.5లక్ష నష్టం వాటిలినట్లు బాధితరైతు తెలిపాడు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

గుంతకల్లుటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ కాంట్రాక్ట్ వాచ్‌మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ, యూనిటెడ్ ఎలక్ట్రానిక్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కేఎం బాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి

రాయదుర్గంరూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అకాడమిక్ ఇయర్ కాకముందే 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి పాఠాలు బోధిస్తున్న నారాయణ విద్యాసంస్థను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఎంఈఓ నాగమణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శివ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

డీ.హీరేహాళ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా రాంపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన కుందేలు భీమా మృతి చెందారు. భీమ భార్య మానక్కతో కలిసి కర్ణాటకలోని జోగిహళ్లిలో జరిగే పెళ్లికి బైక్‌లో గురువారం బయలుదేరి వెళ్లారు. అయితే రాంపురం సమీపాన నేషనల్ హైవేలో రోడ్డు ప్రమాదం జరిగింది. భీమ అక్కడికక్కడే మృతి చెందాడు. మానక్క స్వల్పంగా గాయపడింది. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. వారికి ఇద్దరు సంతానం ఉన్నట్లు చెప్పారు.

మూడు నెలల్లో విద్యుత్ సర్వీసులివ్వండి

● అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసిన 3 నెలల్లోపు ప్రతి రైతుకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడారు. తమ నియోజకవర్గంలో రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసి ఏడాదిన్నరైనా సర్వీసులు ఇవ్వటంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. వెనుకపడ్డ రాయదుర్గం ప్రాంతంలో 2025 జనవరి నాటికి 513 మంది దరఖాస్తుదారులు ఎదురు చూస్తుండగా కేవలం 36 మంజూరు చేశారని వివరించారు. 600 నుంచి 700 అడుగుల లోతు తవ్వినా నీరు పడటం లేదన్నారు. ఒక వేళ ఎవరికైనా నీరు పడ్డా విద్యుత్ సర్వీసులు ఆలస్యం కారణంగా పంటలు వేసుకోలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. 12 సబ్‌స్టేషన్లు మంజూరైనా నేటికీ పనులు జరగలేదన్నారు. కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 464 కి.మీ. కాండెన్సర్(అల్యూమినియం వైర్) కావాల్సి ఉందన్నారు. త్వరితగతిన వీటిని మంజూరు చేయడంతో పాటు వ్యవసాయ సర్వీసులు వెంటనే మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విన్నవించారు.

పెద్దారెడ్డి రాకతో పోలీసుల అప్రమత్తం


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైసీపీ నాయకులు

పుట్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేములకు గురువారం మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి రాకతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందే ఆ గ్రామంలో పోలీసులు పర్యటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆ గ్రామంలో వైసీపీ కార్యకర్త అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వచ్చారు. చాలవేముల ఫ్యాక్షన్ గ్రామం కావడంతో సీఐ సత్యబాబు ముందస్తుగా ఇరువురు నాయకులతో మాట్లాడారు. సమస్యలు తలెత్తకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

విడపనకల్లు/పుట్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ, పడాయిబీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ నిర్వాహకురాలు, సూపర్‌వైజర్ ఉమారాణి మాట్లాడుతూ.. అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యను నేర్పించాలని తెలిపారు. ఏయే వయసు చిన్నారులకు ఏమేమి నేర్పించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

పన్ను విషయంలో వాగ్వాదం

తాడిపత్రి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దాదా సినిమా థియేటర్ , మున్సిపల్ అధికారుల మధ్య పన్ను చెల్లించే విషయంలో గురువారం వాగ్వాదం జరిగింది. పన్ను చెల్లించకపోతే థియేటర్ మూతపడుతుందని అధికారులు హెచ్చరించారు. ఎలా మూసేస్తారో చూస్తామంటూ థియేటర్ వారు వాదనకు దిగారు. ఈనెల 31 వరకు గడువు ఉందని, అంతలోపు పన్ను చెల్లిస్తామని తెలిపారు, గడిచిన ఏడాడికి సంబంధించిన పన్ను ఇంతవరకు కట్టకపోతే ఎలా అని అధికారులు ప్రశ్నించారు. థియేటర్‌ను సీజ్ చేస్తామని, పన్ను కట్టిన తరువాత ఓపెన్ చేసుకోండని సూచించారు. చివరికి థియేటర్ వారు అధికారులకు నచ్చజెప్పి 5రోజులు గడువు కోరారు.

అసభ్యకర మాటలు సోషల్ మీడియాలో వైరల్

తాడిపత్రి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒక దుకాణంలో పని చేస్తున్న మహిళ పట్ల అదే షాపులో గతంలో పనిచేసిన ఓ వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడిన మాటలు సోషల్‌మీడియాలో గురువారం వైరల్ అయ్యాయి. మహిళ 20రోజుల క్రితం ఆ వ్యక్తి తనను అసభ్యకరంగా మాట్లాడాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతవరకు పట్టించుకోని పోలీసులు సోషల్‌మీడియాలో వైరల్ అవగానే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం.

నేడు మీమాటే ముఖ్యం: ఏఎస్పీ

యాడికి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం నేడు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మీ మాటే ముఖ్యం అనే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజా ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగున్నా పరిష్కారం కాని సమస్యల్ని ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. శనివారం కూడా ఇక్కడ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

నిందితుడికి రిమాండ్

పెద్దపప్పూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదాయపల్లి గ్రామానికి చెందిన పోటన్న గారి శ్రీనివాసులు ఈ నెల 17వతేదీన తన భార్య చెవి కోసి కమ్మలు లాక్కెళ్లాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని అతడిని అరెస్టు చేశారు. గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రాజారెడ్డి గురువారం తన ఇంటి సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి పామిడిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సీసీరోడ్ల పనుల పరిశీలన

బొమ్మనహాళ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నేమకల్లులో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ గురువారం పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.